## క్లుప్తంగా

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరి రూరల్ : అధికారులు విధుల్లో నిర్ల క్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీడీవో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయన శుక్రవారం వెంటగిరి మండలంలోని వల్లివేడు, యాతలూరు సచివాలయాలను తనిఖీ చేశారు. విధులకు హాజరు కాని వల్లివేడు సచివాలయం వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారన్నారు. విధులకు సక్రమంగా రాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్‌పీసీఐ అంకౌట్స్ తనిఖీ చేశారు.

### జియో ట్యాగింగ్ సర్వే తనిఖీ



జియో ట్యాగింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు, తనియాలి, కల్లూరు తదితర గ్రామాల్లో సచివాలయం సిబ్బంది చేస్తున్న జియో ట్యాగింగ్ సర్వేను శుక్రవారం ఎంపీడీవో గోవర్ధన తనిఖీ చేశారు. అదే విధంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌పైనా ఆరా తీశారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ



మానమాల వద్ద ప్రవహిస్తున్న మామిడి కాలువ

ఓజిలి: మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాల్లో బీజీబీజీగా ఉన్నారు. ఓజిలి, భట్లకనుపూరు, బత్తలాపురం గ్రామాల్లో 500 ఎకరాల్లో ఎల్లిపైర్లు సాగు చేస్తున్నారు. అలాగే పున్నేపల్లి, నెమళ్లపూడి, మానమాల, జోష్యువారికండిగ, గ్రద్దగుంట, ఇనుగుంట, వజ్జావారిపాళెం గ్రామాల్లో మరో వెయ్యి ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు నారుమడులు తయారు చేస్తున్నారు. కర్రబల్లవోలు, కొండవల్లిపాడు, వెంకటరెడ్డిపాళెం, కురుగొండ తదితర గ్రామాల్లో పచ్చిరొట్ట పైర్లను ట్రాక్టర్లతో దున్నుతున్నారు. పున్నేపల్లి, మానమాల గ్రామాల వద్ద వున్న మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువులకూ నీరు చేరుతోంది.

### అంగన్‌వాడీకి కుర్చీలు, కార్పెట్స్ వితరణ



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట సెక్టారు పరిధిలోని కుమ్మరిగుంట -1 అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం క్రెడిట్ ఆక్సిస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు కుర్చీలు, కార్పెట్లు అందజేశారు. వారిని సీడీపీవో శంషాద్‌బేగం అభినందించారు. ఫౌండేషన్ డీఎం జగదీష్, సిద్దారెడ్డి, చంద్రారెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల సంక్షేమానికి తమ ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ



చపాతి మేకింగ్ పరిశ్రమను పరిశీలిస్తున్న పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

గూడూరు రూరల్ : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఔత్సాహికులు ముందుకు వస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుందని జిల్లా ఆహార పరిశ్రమల శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరు రూరల్ పరిధిలోని చవటపాళెంలో ఏర్పాటైన చపాతి మేకింగ్ పరిశ్రమను పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అలాగే చిన్న పాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన పెట్టుబడిలో పీఎంఎఫ్ఎం స్కీమ్ కింద ప్రభుత్వం 35 శాతం రాయితీ ఇస్తోందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌పీ చంద్రబాబు పాల్గొన్నారు.

# కలగా చెక్ డ్యామ్‌ల నిర్మాణం



మీజూరు వద్ద అర్ధంతంగా ఆగిన చెక్‌డ్యామ్



వేలికాడు సమీపంలో అసంపూర్తిగా ఉన్న చెక్‌డ్యామ్

- 2001లో ప్రారంభమైన పనులు
- నిర్మాణం పూర్తయితే 8 వేల ఎకరాలకు నీరు
- సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**పుష్కలంగా నీరుంటే పంటలు బాగా పండుతాయి. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయి. దొరవారిసత్రం మండలంలోని తీర గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంతోపాటు 8 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని 2001లో చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. పనులు దక్కించుకున్న నాటి అధికార పార్టీ నాయకుల స్వార్థంతో పనులు పూర్తి కాలేదు. దీంతో రైతులు, ప్రజల కల కలగానే మిగిలిపోయింది.**

దొరవారిసత్రం : దొరవారిసత్రం, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లోని తీర ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు పులికాట్ సరస్సులో కలిసిపోతోంది. వాటిని నిలువరిస్తే ప్రజలకు తాగునీటితోపాటు వ్యవసాయానికి సాగునీరు అందించవచ్చు. 2001లో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లతో దొరవారిసత్రం మండలంలోని తీర ప్రాంతాలైన మీజూరు, కారికాడు, వేలికాడు ప్రాంతాల్లో నాలుగు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో పనికి ఆహారం పథకం కింద పనులు దక్కించుకున్న టీడీపీ నాయకులు ఉన్నకాడికి నిధులు దోచేశారు. చెక్ డ్యామ్ పనులు పూర్తి చేయలేదు. ఆగిపోయిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారుల విన్నపం మేరకు 2016-17లో మళ్లీ రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. కానీ వన్యప్రాణి విభాగం అధికారులు పనులు అడ్డుకున్నారనే నెపంతో పనులను ఆపేశారు. నిధులు ఏమయ్యాయో ఎవరికీ తెలియని పరిస్థితి. ఈ విషయాన్ని అప్పుడు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి వెళ్లినా ఫలితం లేదు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం మాత్రం కలగానే మిగిలిపోయింది.

**చెక్ డ్యామ్‌లు పూర్తయితే..**

తీర గ్రామాల్లో చెక్‌డ్యామ్ పనులు పూర్తయితే దొరవారిసత్రం, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లోని 21 గ్రామాల్లో 8 వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. తీర గ్రామాల్లో బీడు భూములు కూడా సాగులోకి వస్తాయి. అదే విధంగా వివిధ ప్రాంతాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతుంది. ప్రతి ఏటా ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం తప్ప నిధులు మంజూరైన దాఖలాలు లేవు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తయ్యేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**చెక్ డ్యామ్‌ల నిర్మాణం రైతు కల**



తీర ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. అవి పూర్తయితే దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 8 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. పనులు పూర్తి చేసేందుకు నాయకులు ముందుకు రావాలి. విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుచేయించాలి.

– వై.సుబ్రమణ్యం, రైతు, కారికాడు గ్రామం

**చెక్ డ్యామ్‌లతో సాగు, తాగునీటి సమస్యకు చెక్**



మీజూరు వద్ద చెక్ డ్యామ్ పనులు పూర్తయితే సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని రైతులకు సాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. తాగునీరు సైతం పుష్కలంగా లభిస్తుంది. అధిక విస్తీర్ణంలో బీడు భూములు సాగులోకి వస్తాయి. గతంలో నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. ఆ నిధులు కూడా ఏమయ్యాయో తెలియదు.

– కె.రమణమ్మ, సర్పంచ్, మీజూరు పంచాయతీ

### మాజీ సీఎం జగన్‌ను కలిసిన పాలూరు



నాయుడుపేట టౌన్ : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నాయుడుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పాలూరు దశరథరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ స్థితిగతులను జగన్‌కు వివరించినట్టు పాలూరు వెల్లడించారు.

### గురుకులంలో వసతులపై ఆరా

కోట: విద్యానగర్‌లోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం బీసీ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య తనిఖీ చేశారు. పాఠశాలలో సరైన వసతులు లేవని, భవనాలు శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు బాలికలు ఇబ్బందులు పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డిప్యూటీ సెక్రటరీ పాఠశాలను తనిఖీ చేసిన వసతులపై ఆరా తీశారు. అద్దె భవనంలో నడుస్తున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలను మరో చోటుకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ నారాయణరావు పాల్గొన్నారు.

### విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఓజిలి: విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం వాకాటివారికండ్రిగలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకోవాన్నారు. గురుకుల పాఠశాలలలో నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, డీటీ మధుసూదన్‌రాజు, ఎంఈవోలు శైలజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఉంటాం



మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, చైర్ పర్సన్ దీపికను సత్కరిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ ప్రజలకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేటలోని కిలివేటి నివాసం వద్ద శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి దీపికను గజమాలలతో సత్కరించారు. సంజీవయ్య మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్‌గా దీపిక సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. చైర్ పర్సన్ దీపిక మాట్లాడుతూ పార్టీలకతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఒట్టూరు కిషోర్ యాదవ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మీ, మహిళ రాష్ట్ర కార్యదర్శి రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ గల్లంతు

- అబద్ధాలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు
- డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ గల్లంతయ్యాయని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం చిల్లకూరులోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనానికి రూ.5,387 కోట్లు కేటాయించారని, అన్నదాతా సుఖీభవకు రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని చూస్తే చంద్రబాబు మోసం అర్థమవుతుందన్నారు. పేదలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.895 కోట్లు మాత్రమే ప్రకటించి ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడగడం ప్రతి పౌరుడికీ హక్కు ఉందని, కొందరు పనికిమాలిన టీడీపీ నాయకులు చంద్రబాబును విమర్శించే అర్హత లేదంటూ మాట్లాడడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. తెలుగు తమ్ముళ్లు ఊరూరా బెల్టు షాపులు బహిరంగంగా నిర్వహించినా చర్యలు లేవన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 యేళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛను, 18 యేళ్లు దాటిన ప్రతి ఆడబిడ్డకూ రూ.18 వేలు తదితరాలపై కూటమి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుంటే ప్రజల పక్షాన న్యాయ పోరాటాన్ని పెళ్లకూరు మండలం నుంచి మొదలు పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, నాయకులు బాలసుబ్రమణ్యం, రమణయ్య, చంద్రయ్యనాయుడు, అశోక్, వెంకమరాజు, గురవయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



వాకాడు: తూపిలిపాళెం వద్ద సముద్ర స్నానాలు ఆచరిస్తున్న మహిళా భక్తులు

ఓజిలి/సైదాపురం/నాయుడుపేటటౌన్/సూళ్లూరుపేట/వాకాడు/చిట్టమూరు(వాకాడు)/రాపూరు/కలువాయి: గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు.

– ఓజిలి మండలంలోని నెమళ్లపూడి, భట్లకనుపూరు, ఇనుగుంట, ఓజిలి, సగుటూరు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సైదాపురం మండలంలోని సిద్ధలయ్యకోన, తురిమెర్ల శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. శివ పార్వతులు, నవకోటి, నవనాథుల సిద్ధలయ్య, వారి ప్రియశిష్యుడు సారంగధరునికి అభిషేకం చేశారు.

– నాయుడుపేట మండలం విన్నమాలలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు.

– సూళ్లూరుపేటలోని నాగేశ్వరాలయం, మన్నారుపోలూరులోని సంతానేశ్వరస్వామి, బస్టాండ్ సెంటర్‌లో అభయశంకరుని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకం చేశారు. నాగేశ్వరస్వామి ఆలయం ముందు కార్తీక దీపాన్ని వెలిగించారు.

– వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రంలో స్నానం ఆచరించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

– చిట్టమూరు మండలం మల్లాంలోని మార్కండేశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు. సాయంత్రం జోతిర్లింగ దీప దర్శనం చేపట్టారు.

– రాపూరులోని రామనాథేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస రుద్రాభిషేకం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు.

– కలువాయి మండలం పెన్నబద్దెవోలు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దీపాలు వెలిగించి నదిలో వదిలిపెట్టారు.





సూళ్లూరుపేట : శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, నాయుడుపేట టౌన్ : భక్తులకు అన్నదానం

## దౌర్జన్యంగా భూమి ఆక్రమణ

**టీడీపీ నాయకుల అరాచకాలు రోజు రోజుకూ మితిమీరుతున్నాయి. వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతు పొలంలో ఉన్న బోరుకు దౌర్జన్యంగా విద్యుత్ మోటారు బిగించారు. రైతుకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్‌మెంట్ భూమి 70 సెంట్లను ఆక్రమించుకున్నారు. రైతు తన భూమి చుట్టూ వేసుకున్న కంచెను పోలీసులు దగ్గరుండి తొలగించడం గమనార్హం.**

- అధికారుల అండతో కంచె తొలగింపు
- బోరుకు విద్యుత్ మోటారు ఏర్పాటు



కంచెను తొలగించి రైతు పొలంలోకి వచ్చిన పోలీసులు, రెవెన్యూ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గూడూరు రూరల్ మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన సన్నకారు రైతు మస్తాన్‌రెడ్డికి 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 321-7లో 70 సెంట్ల భూమిని అసైన్‌మెంటు కింద మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ భూమిని ఆయన సాగు చేసుకుంటున్నాడు. ఇటీవల నిమ్మ తోట సాగు చేసుకోవాలని బోరు కూడా వేసుకున్నాడు. దాని పక్కనే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల భూమి ఉంది. వారి కన్ను రైతు ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్ భూమిపై పడింది. దాన్ని ఆక్రమించుకోవాలని పలుమార్లు ప్రయత్నించారు. అలాగే పొలంలో ఉన్న బోరును సొంతం చేసుకోవాలని గతంలో అధికారుల ద్వారా ఒత్తిడి చేశారు. రైతు ఆందోళన చేయడంతో గత తహసీల్దార్ రెవెన్యూ కోర్టుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై కేసు గూడూరు సబ్ కలెక్టర్ కోర్టులో నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ భూమిని ఆక్రమణకు పూనుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాలతో రూరల్ పోలీసులు దగ్గరుండి సన్నకారు రైతుకు చెందిన భూమికి ఉన్న కంచెను తొలగించారు. బోరులో విద్యుత్ మోటారు బిగించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు అవసరమైన విద్యుత్‌ను కూడా కొంత దూరంలోని మరో రైతు పొలం నుంచి వాడుకునేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో రైతు మస్తాన్‌రెడ్డి ఇదెక్కడి న్యాయం అని తహసీల్దార్‌ను అడిగేందుకు ప్రయత్నించగా భూమి కావాలంటే మిన్నకుండి పోవాలని హెచ్చరికలు జారీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో రైతు ఏమి చేయాలో తెలియక కన్నీటిపర్యంతమవుతున్నాడు.

### బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి

దక్కిలి : ఆదివాసీ ఉద్యమ యోధుడు బిర్సాముండా జయంతిని శుక్రవారం దక్కిలి పంచాయతీ కందలవారిపల్లి గిరిజన కాలనీలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. మాదకద్రవ్యాల నిరోధం, స్వచ్ఛతాహి సేవపై ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యమకారుడు బిర్సాముండాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గిరిజనులు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటున్న అటవీ భూములకు హక్కులు కల్పించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. అనంతరం గిరిజనులైన ఎంపీటీసీ వెంకటరమణమ్మ, సర్పంచ్ వేమక్కను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, దక్కిలి ఎంపీటీసీ ఎం.వెంకటరమణమ్మ, గ్రామ సర్పంచు శనగా వేమక్క, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

### తరగతి గదుల మరమ్మతులకు చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ యామిని

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీటీసీ ఊటుకూరు యామిని పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాలలోని రెండు గదులు పెచ్చులూడి కింద పడడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలోనే ఉన్న ఉప విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలోని గదుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే రెండవ పట్టణ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ స్థలంలో భవనాల నిర్మాణ విషయంపై అధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు.

## ఘనంగా మహా చండీయాగం



సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో..



ముత్యాలమ్మ ఆలయంలో ..

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహా చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెంగాళమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు.

**ముత్యాలమ్మ ఆలయంలో..**

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కలశాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. చండీ యాగం నిర్వహణకు భక్తులు ముందుకు వస్తున్నారని, శుక్రవారం నిర్వహించిన యాగానికి ఉభయకర్తలుగా ఆలయ ట్రస్టు సభ్యులు బల్లవోలుకు చెందిన దువ్వూరు చంద్రశేఖరరెడ్డి బల్లవోలు సర్పంచ్ మంజులమ్మ, తూర్పుకనుపూరుకు చెందిన గూడలి శివ వరప్రసాద్, హేమలత వ్యవహరించినట్టు ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ తెలిపారు.

## పంట కాలువపై అక్రమ నిర్మాణం



పంట కాలువపై యంత్రాలతో చేపట్టిన తవ్వకాలు



అక్రమ త్రవ్వకాలను అడ్డుకున్న రైతులు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామం సర్వే నంబరు 100/10లో ఉన్న వ్యవసాయ పంట కాలువపై హై ఓల్టేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం చేపట్టిన హైటెన్షన్ టవర్ నిర్మాణ పనులను శుక్రవారం గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న హై ఓల్టేజ్ విద్యుత్ తీగల ఎత్తు పెంచేందుకు హైటెన్షన్ టవర్ నిర్మాణం చేస్తున్నారు. పంట కాలువపై నిర్మాణం చేపట్టవద్దని సంబంధిత అధికారులను కోరినా ఫలితం లేదు. ఈ క్రమంలో గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. పంట కాలువపై హైటెన్షన్ టవర్ నిర్మించడం వల్ల భవిష్యత్తులో పంట కాలువ అభివృద్ధికి, సాగునీటి సరఫరాతో పాటు వ్యవసాయ పొలాల్లోకి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు పగడాల శరత్‌కుమార్‌రెడ్డి, జయరామిరెడ్డి, చక్రపాణి, భద్రయ్య, నాగరాజు, వెంకటకృష్ణయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

నాయుడుపేట టౌన్ : మండలంలోని పండ్లూరు సమీపంలో శుక్రవారం ప్రైవేటు ట్రావెల్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీకొంది. కొందరు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు 30 మందికి పైగా ప్రయాణికులతో విజయవాడ నుంచి బెంగళూరు వెళుతోంది. పండ్లూరు గ్రామ సమీపంలో వాహనాలు అధిగమించే క్రమంలో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు కొంతమంది ప్రమాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సులోని ప్రయాణికులను మరో ప్రైవేటు బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.